మురుగన్‌కి మరో పేరు దాసు. ఇంకో పేరు ఇందు మాస్టర్. శ్రీలంక తమిళుడు. అప్పట్లో వయసు 21 ఏళ్లు. ఇతను ఎల్‌టిటిఇ ఇంటెలిజెన్సులో ముఖ్యమైన వ్యక్తి. శివరాజన్‌కు సహాయకుడు. మద్రాసులోనే మడిప్పాక్కం అనే ప్రాంతంలో ఓ ఎల్‌టిటిఇ శిబిరంలో వుండేవాడు. ఇతని ద్వారానే శివరాజన్ జయకుమార్, విజయన్ క్యాంపులు నెలకొల్పాడు. వాళ్లకు ఆర్థికంగా, యితరత్రా సాయపడ్డాడు. అరివును చేరదీశాడు. అరివు పూర్తిపేరు అరివు పేరారివాలన్. కంప్యూటర్ సైన్సులో డిప్లొమా హోల్డర్. 1990 నుండి మద్రాసులో వుంటున్నాడు. ఎల్‌టిటిఇ పట్ల అంకితభావం కలిగి వున్నా అప్పటివరకు అజ్ఞాత కార్యకలాపాల్లో పాలు పంచుకోలేదు. మురుగన్ కారణంగా యిప్పుడు రంగంలోకి దిగాడు. ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంలో అతని నైపుణ్యం రాజీవ్‌ను చంపిన బెల్టు తయారీకి పనికి వచ్చింది. తాము చంపబోతున్న దెవరినో చెప్పకుండా మురుగన్ అరివును బెల్టు తయారుచేయమన్నాడు.

ఎల్‌టిటిఇకి సహాయం చేస్తోందన్న కారణంగా కేంద్రం 1991 జనవరిలో డిఎంకె ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసి రాష్ట్రపతి పాలన విధించిందని చెప్పాను కదా, అప్పటినుండి ఎల్‌టిటిఈ సానుభూతిపరులకు కష్టాలు వచ్చిపడ్డాయి. శ్రీలంక వాళ్లకు యిల్లు యివ్వడానికి సాధారణ ప్రజలు జంక సాగారు. 1991 ఫిబ్రవరి నెలాఖరులో పోరూరు శిబిరంలో వున్న నిక్సన్ (నిశాంతన్) వచ్చి మురుగన్‌ను భాగ్యనాథన్ దగ్గరకు తీసుకుని వచ్చి యింట్లో పెట్టుకోమన్నాడు. నాకు బాగా కావలసిన వ్యక్తి అన్నాడు. భాగ్యనాథన్ కాదనలేదు కదా. అతన్ని యింట్లోనే పెట్టుకుని చుట్టుపక్కలవాళ్లు అడిగితే "మా బంధువు" అని చెప్పుకున్నాడు. ఈ మురుగన్ మంచి మాటకారి. ఎదుటివాళ్లను బుట్టలో పెట్టడం బాగా తెలుసు. భాగ్యనాథన్ తల్లి పద్మకున్న చిల్లరబాకీలన్నీ తీర్చేశాడు. వాళ్లకోసం డబ్బు ఖర్చు పెట్టడం, అడపా దడపా బహుమతులు యివ్వడం చేసి వాళ్ల ఆదరం పొందాడు. తనకు సహాయంగా అరివును కూడా తెచ్చి పెట్టుకున్నాడు. నిజానికి అరివు భారతీయుడే కదా, వాళ్ల యిల్లు మద్రాసులోనే వుంది కదా అయినా భాగ్యనాథన్, అతని తల్లి కిక్కురుమనలేదు. ఈ విధంగా భాగ్యనాథన్ యింటిని మరో ఎల్‌టిటిఇ స్థావరంగా మార్చేశాడు మురుగన్. తనెవరో తెలియకుండా వుండడానికి ఇంగ్లీషు నేర్పే ట్యుటోరియల్ కాలేజీలు రెండిట్లో చేరి స్టూడెంటునని చెప్పుకునేవాడు.

మురుగన్ తరువాతి టార్గెట్ నళిని. నళినిలో ఒక మొండితనాన్ని, ధైర్యాన్ని చూశాడతను. ఒక దిగువ మధ్యతరగతి అమ్మాయి తల్లితో, తమ్ముడితో కలిసి వుండకుండా విడిగా వుండడం అతన్ని ఆకర్షించింది. తల్లి యిల్లు ఊరికి మధ్యలో వున్న రాయపేటలో వుండగా అది కాదని ఎక్కడో ఊరికి చివరున్న విల్లివాకంలో ఆరువాటాలున్న యింట్లో 250 రూ.లకు అద్దెకు తీసుకుని ఓ గదిలో వుంటోందంటే కాస్త వింతమనిషే అనిపించింది. రాజీవ్ హత్యలో వుపయోగపడుతుందనిపించింది. నళినితో స్నేహం పెంచుకున్నాడు. షాపింగ్‌కి తీసుకుని వెళ్లేవాడు. ఆమె కోసం డబ్బు ఖర్చు పెట్టేవాడు. కబుర్లు చెప్పేవాడు. నళిని మురుగన్ అంటే మనసు పడింది. నిజానికి అతను ఆమె కంటె ఆరేళ్లు చిన్న. పొట్టి. అయినా సరే అతను ఏం చెపితే దానికి తల వూపే స్థితికి వచ్చేసింది. మురుగన్ ఎల్‌టిటిఇ సిద్ధాంతాలన్నీ నూరిపోసి పోసి ఆమెను పూర్తిగా ఎల్‌టిటిఇ తీవ్రవాదిగా మార్చేసాడు. ఆమె బాగా తన మనిషిగా చేసుకున్నాక అప్పుడు చెప్పాడు - "నేను ఎల్‌టిటిఇ తరఫున పనిచేయడానికి వచ్చాను. నాకు సహాయపడే వ్యక్తి నెవరినైనా చూసి పెట్టగలవా?" అని. ఆమె హరిబాబును చూపించింది. మురుగన్ అతన్ని ఎలా వాడుకోవాలో ప్లాను చేసుకున్నాడు. భాగ్యనాథన్, అరివు, హరిబాబు, మురుగన్ కలిసి ఎల్‌టిటిఈ గురించి దూరదర్శన్‌లో వచ్చే వార్తలను రికార్డు చేసేవారు. దీని కావలసిన టెక్నికల్ సపోర్టు అంతా అరివుది. ఇవన్నీ శ్రీలంకకు పంపేవారు.

1991 మార్చిలో శివరాజన్ మద్రాసు వచ్చాడు. మురుగన్ తన బాస్‌ను తీసుకెళ్లి భాగ్యనాథన్‌కి పరిచయం చేశాడు. (భాగ్యనాథన్ పట్టుబడినప్పుడు శివరాజన్ గురించి గుర్తులు చెప్పడానికి యీ పరిచయం సంఘటన ఉపయోగపడింది) శివరాజన్ అప్పటిదాకా మురుగన్ చేసిన పని చూసి సంతృప్తి చెందాడు. ముత్తురాజా, నిక్సన్‌లను జాఫ్నా వెళ్లిపోమన్నాడు. అతను వచ్చేముందే అతనికి డ్రైవింగ్ లైసెన్సు గురించి ఏర్పాట్లు చేయమని మురుగన్ రాబర్ట్ పయాస్‌ను ఆదేశించాడు. అతను తన అడ్రసు యిచ్చి తనకు, శివరాజన్‌కు, మహేశ్వరన్ అనే యింకో అతనికి లెర్నర్స్ లైసెన్సులు తీసుకున్నాడు. (రాజీవ్ హత్య తర్వాత సిట్ వాళ్లు ఆర్టీఓ ఆఫీసులు తనిఖీ చేసినప్పుడు యీ సమాచారం బయటపడింది. అప్పటికే పయాస్‌పై అనుమానం వుంది. ఈ సమాచారం అందడంతో అరెస్టు చేశారు). అరివు ద్వారా మురుగన్ శివరాజన్ తిరగడం కోసం ఒక కవాసాకి బజాజ్ మోటర్ సైకిల్ కొనిపించాడు. అడ్రసుగా పద్మ అడ్రసు యిమ్మన్నాడు. రాజీవ్ హత్య తర్వాత శివరాజన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోతూ యీ మోటర్ సైకిల్‌ను భాగ్యనాథన్‌కు బహుమతిగా యిచ్చి వెళ్లిపోయాడు.

మురుగన్
పోలీసులకు పట్టుబడ్డాక...



మురుగన్ నళినిని ఓ పక్క ప్రేమిస్తూనే మరోపక్క ఆమెను మానవబాంబుగా తయారుచేయడానికి సిద్ధపడ్డాడు. రాజీవ్ ఎంత దుర్మార్గుడో అతని ఆదేశాల మేరకు శాంతిసేన ఎన్ని అకృత్యాలు చేసిందో నూరి పోసి ఆమెను పూర్తిగా మార్చివేశాడు. 'రాక్షసుడు' రాజీవ్‌ను చంపడానికి తను చావడానికైనా ఆమె సిద్ధపడింది. కానీ ఆమెను ట్రెయిన్ చేయాలంటే ఎక్కడో విల్లివాక్కంలో వుంటే ఎలా? తను వున్న చోట వుండాలి. అందుకని "నువ్వు మీ అమ్మతో కలిసి వుండవచ్చుకదా" అని ప్రోద్బలం చేశాడు. ఆమెకు యిష్టం లేకపోయినా మురుగన్ మాట కొట్టేయలేక సరేనంది. ఇది 1991 ఏప్రిల్ నెలలో. అంతలోనే అతనికి కబురు వచ్చింది - శివరాజన్ మానవబాంబు థానుతో కలిసి వస్తున్నాడని, థానుతో

బాటు స్టాండ్‌బైగా యింకో మానవబాంబు శుభా కూడా వస్తోందనీ. ఇక నళిని అవసరం లేదని తెలియగానే ప్లాను మార్చేశాడు. "ఇక్కడ వద్దులే, విల్లివాకంలోనే వుండు" అనేశాడు. మురుగన్ ఏమన్నా దానికి తలాడించే గొఱ్ఱె నళిని సరేనంది.

మోటర్ సైకిల్‌తో బాటు శివరాజన్ కోసం అరివు చేత 9 వోల్టుల గోల్డెన్ పవర్ కారు బ్యాటరీ కూడా కొనిపించాడు మురుగన్. ఆ బ్యాటరీతో అత్యంత అధునాతన వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్‌ను తయారుచేయించి శివరాజన్‌కి యిచ్చాడు. దాని కథ వచ్చే సోమవారం. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**